క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని గురువారం సాక్షి దినపత్రిక 'అటెన్షన్ ప్లీజ్' లో ప్రచురితమైన 'ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్' కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పిచ్చిమొక్కలను తొలగించారు. ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మెన్ సంతోశ్‌కుమార్, జేఎల్ఎం సాగర్ ఉన్నారు.

ఈజీఎస్ గ్రామసభలు



శాయంపేట : మండలంలోని 24 గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై 15వ సామాజిక తనిఖీ బృందం సభ్యులు గురువారం రెండు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. పెద్దకోడెపాక, కొప్పుల గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఉపాధి హామీ పనులపై విచారణ చేపట్టి రికార్డులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనుల్లో జరిగిన పొరపాట్లను గుర్తించారు. బాధ్యుల నుంచి వివరణ తీసుకున్నారు. ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, మాజీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్ నుంచి కొత్తగట్టు వరకు ప్రధానరహదారిపై ఏర్పడిన గుంతలను ఆత్మకూరు పోలీసులు గురువారం పూడ్చివేయించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. సీఐ సంతోశ్, సిబ్బంది ఖలీమ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు ఓటుహక్కు కల్పించాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి



దామెర : ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో దామెర, ల్యాదెళ్ల, పులుకుర్తి, వెంకటాపూర్, ఊరుగొండ ఎస్‌జీటీ ఉపాధ్యాయులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హాజరైన తిరుపతి మాట్లాడుతూ.. ఎస్‌జీటీలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటువేసే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. డీఈడీతో పాటు బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. బకాయిలోఉన్న ఐదు డీఏలతో పాటు ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు రఘుపతి, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, నాయకులు భాస్కర్, రాధాకృష్ణచారి, అజీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైడ్రా తరహా సంస్థను ఏర్పాటు చేయాలి

శాయంపేట : హైదరాబాద్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థ మాదిరిగా రాష్ట్ర వ్యాప్తంగా వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు హైడ్రా తరహా సంస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య ప్రభుత్వాన్ని కోరారు. అన్ని జిల్లాలకు, మండలాలకు విస్తరింపజేయాలని అన్నారు. చెరువులు, కుంటల పరిరక్షణకే ధ్యేయంగా హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. మండలాల్లో కూడా హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలను రక్షించాలని కోరారు. మండలాల్లో, గ్రామాల్లోని ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకొని భవనాలు, ఇళ్లు, ప్లాట్లు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- విద్యార్థులకు సూచనలు చేసిన అధికారులు
- స్పోర్ట్స్ డే ఆకారంలో ఆకట్టుకున్న విద్యార్థులు



స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

శాయంపేట : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని స్పెషల్ ఆఫీసర్ మాధవి సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మాందారిపేటలో గల కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు. పీఈటీ కావ్య క్రీడలు ఆడించిన అనంతరం ప్రత్యేకాధికారి మాధవి మాట్లాడారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ని స్ఫూర్తిని తీసుకుని ప్రతీ క్రీడాకారుడు క్రీడల్లో రాణించాలన్నారు. హాకీ క్రీడల్లో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో గోల్స్ చేయడంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించదగిన ఒలంపిక్ క్రీడల్లో వరుసగా 1928, 1932, 1936 సంవత్సరాల్లో బంగారు పతకాలు సాధించి ఇండియా పేరును నలువైపుల చాటారని గుర్తు చేశారు. అతని ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం.. మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని ముప్పారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఉపన్యాసాలు, పాటలు, కవితలు, పద్యాలు, నృత్యాలతో అలరించారు.

దామెరలో..

దామెర : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డిస్నీల్యాండ్ పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, లక్ష్మీనివాసం సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వేడుకలు నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతీ క్రీడాకారుడు క్రీడా నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని, స్నేహాభావం పెంపొందుతుందన్నారు.



ధర్మసాగర్: మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిల్ కుమార్

భూమయ్య పోరాటం చిరస్మరణీయం

ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్



సంతాప సభలో మాట్లాడుతున్న అశోక్

శాయంపేట: పేదల సమ్యస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ.. తుది శ్వాస వరకు పార్టీని వీడకుండా ప్రజాసమస్యలపై ఉద్యమించిన పరికరాల భూమయ్య సేవలు చిరస్మరణీయమని ఎంసీపీఐ(యు) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లిలో గురువారం కామ్రేడ్ పరికరాల భూమయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని బస్టాండ్ సెంటర్‌ల్లో ఏర్పాటు చేసిన స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సంతాప సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్దికాయల అశోక్.. భూమయ్య సేవలను గుర్తు చేశారు. స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దూదిపాల బుచ్చిరెడ్డి, చిందం రవి, మారపల్లి బుజ్జన్న, రాజు, రాజేందర్, కట్టయ్య, భాస్కర్, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, కాటం నాగభూషణం, మాస్ సావిత్రి, గడ్డం నాగార్జున, ఎండీ ఉస్మాన్, చిలుకల కొమురయ్య పాల్గొన్నారు.

పోరాట యోధుడు భూమయ్య

పేదల సంక్షేమం, జిల్లాల పునర్విభజన సమయంలో కామ్రేడ్ పరికరాల భూమయ్య చేసిన పోరాటం మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. భూమయ్య ప్రథమ వర్ధంతిని మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిందం రవి, మారపల్లి బుజ్జన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గణపతికి అరుదైన అవకాశం



గవర్నర్‌తో కరచాలనం చేస్తున్న ఉపాధ్యాయుడు రాచర్ల గణపతి

దామెర: మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ రాచర్ల గణపతికి అరుదైన అవకాశం లభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ములుగు జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్‌ను గణపతి కలుసుకున్నారు. చరిత్ర పరిశోధకుడిగా ములుగు జిల్లాపై చేసిన పరిశోధనలు, తాను రచించిన తెలుగువారి వారసత్వం, సబార్డినేట్ రూలర్స్ ఇన్ మెడివల్ దక్కన్, చంద్రగిరి పర్యాటక సిరి వంటి రచనల గురించి గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్‌తో నిర్వహించిన లంచ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ గవర్నర్‌ను కలవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఐఐటీ ఫౌండేషన్ కోర్సును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సమ్మయ్య

దామెర : మండలంలోని విద్యార్థులు ఐఐటీ ఫౌండేషన్ కోర్సును వినియోగించుకోవాలని ఒగ్లాపూర్ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సమ్మయ్య కోరారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు ఐఐటీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఐఐటీ విద్యాలయాల్లో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డేవిడ్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సౌమ్య, శ్రీకాంత్, బాలకృష్ణ, సమ్మయ్య, భారతి, ప్రియదర్శిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్ తయారీకి అధికారుల కసరత్తు



సమస్యలను పరిశీలిస్తున్న అధికారులు

పరకాల : మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, మున్సిపల్ కమిషనర్ నర్సింహ తెలిపారు. ఈనెల 24న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరకాల పట్టణ సమస్యలపై సుదీర్ఘ చర్చ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. దీంతో డీపీఆర్ రూపొందించేందుకు సంబంధిత ఏజెన్సీలతో పలు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. డీపీఆర్‌ను ఎమ్మెల్యేకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ కాలనీలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, డీపీఆర్ ఏజెన్సీ సభ్యులు పాల్గొన్నారు.

నాసిరకం పురుగు మందులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్‌సింగ్

పరకాల : నాసిరకం బయో, పురుగుల మందులు మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రవీందర్ సింగ్ అన్నారు. పరకాల రైతు వేదికలో గురువారం పరకాల ఫర్టిలైజర్ డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫర్టిలైజర్స్, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందించాలని కోరారు. ప్రతీ లైసెన్స్ డీలర్ రైతుల పంటలకు సిఫార్సు చేసిన ఎరువులనే ఇవ్వాలని కోరారు. ఈ ఆరుగాలం కష్టపడి పంటసాగు చేసే రైతులను మోసం చేయొద్దని సూచించారు. నకిలీ పురుగుమందులకు తావు లేదని, ఎవరైనా నకిలీ మందులు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రవీందర్, పరకాల సీఐ క్రాంతి కుమార్, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, శాయంపేట మండలాల వ్యవసాయ, టెక్నికల్ అధికారులు, ఫర్టిలైజర్స్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కూతుళ్లే కుమారులై..



శాయంపేట : అనారోగ్యంతో మృతిచెందిన తండ్రికి కూతుళ్లే పెద్ద కూమాలై దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సంఘటన మండలంలోని ఆరెపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరెపల్లి గ్రామానికి చెందిన కుసుంబ వేణు (48) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. అయితే వేణుకు ఇద్దరు కుమార్తేలే కావడంతో వారే దహన సంస్కారాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అతడి కుమార్తెలు ఐష్, రేష్మ కుమారుల బాధ్యత తీసుకొని తండ్రికి తలకొరివి పెట్టి దహన సంస్కారాలను పూర్తి చేశారు. అయితే ఏడాది క్రితమే వేణు తండ్రి మృతిచెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ : బైక్ అదుపుతప్పిన ఘనటలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామానికి చెందిన వలుపదాసు ప్రశాంత్ (26) జనగామలో తన స్నేహితుడి వివాహానికి ఈనెల 22వ తేదీన వెళ్లాడు. మరుసటిరోజు తన స్నేహితుడు గట్టు ప్రశాంత్‌తో కలిసి హనుమకొండకు ద్విచక్రవాహనంపై మడికొండ బయలుదేరాడు. ఈక్రమంలో మడికొండ సబ్‌స్టేషన్ ఎదురుగా తెల్లవారుజామున బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కు బలమైన గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి లైఫ్‌లైన్ ఆస్పత్రికి, ఆ తర్వాత ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రశాంత్ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.

'నమ్మించి మోసం చేశాడు'

వేలేరు : 'మాయమాటలు చెప్పి నమ్మించాడు.. ఆర్థికంగా వాడుకుని వదిలించుకున్నాడు.. అతనిపై చర్యలు తీసుకోవాలి' అని ఓ మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ పావని తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరుకు చెందిన సూత్రపు సతీశ్, తాను విద్యార్థి దశలోనే ప్రేమించుకున్నామని, పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో వరంగల్ కరీమాబాద్‌కు చెందిన దేవులపల్లి ఓంకార్‌తో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగిందని, ఇద్దరు ఆడపిల్లలు కలిగారని తెలిపింది. కొంత కాలం క్రితం అమ్మవాళ్ల గ్రామమైన వేలేరుకు వచ్చినట్లు తెలిపింది. ఈ క్రమంలో సతీష్ మళ్లీ తనకు ఫోన్ చేశాడని, భర్తతో విడిపోతే మళ్లీ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడని తెలిపింది. తన భర్తతో విడిపోయేలా చేశాడని, అవసరాల కోసం లక్షల రూపాయల డబ్బులు తీసుకున్నాడని పేర్కొంది. కొంత కాలం గడిచిన తర్వాత రహస్యంగా పెళ్లి చేసుకున్నామని తెలిపింది. ఈ క్రమంలో తన వద్ద అవసరాలకు సతీశ్ తీసుకున్న డబ్బులు అడిగినందుకు తనను దూరం పెడుతూ వచ్చాడని, కారణం లేకుండానే బూతులు తిడుతూ శారీరకంగా, హింస్తున్నాడని తెలిపింది. నమ్మించి మోసం చేసిన సతీశ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై తెలిపారు.

ఆలయంలో సుదర్శనచక్ర పునఃప్రతిష్ఠాపన

- పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలోని గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గుడిగోపుర సుదర్శనచక్ర పునఃప్రతిష్ఠాపన, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరుకాగా అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ భక్తిభావంతో సమాజానికి సేవ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

పరామర్శ..

కొండపర్తి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాచర్ల రాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేశారు. ఆలయ చైర్మన్ వెంకట్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సుమన్, మండల నాయకులు బుచ్చిరెడ్డి, రుగ్వేద్‌రెడ్డి, రాకేశ్ రెడ్డి, సుధీర్, రాధిక, శ్రీనివాస్, సుమన్, రహీం, బాబు, రాజేందర్‌రెడ్డి, అశోక్, రమేశ్, సునీల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



శాయంపేట : శిక్షణలో పాల్గొన్న బీఎల్‌ఓలు



నడికూడ : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గుండాల నాగరాజు

- తహసీల్దార్లు సుభాషిణి, నాగరాజు

శాయంపేట : మండలంలోని బీఎల్‌ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభాషిణి హెచ్చరించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలకు ఓటరు నమోదు, సవరణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులను గుర్తించి ఫారం–8 ద్వారా సవరణలు చేయాలని, కొత్త ఓటర్లను గుర్తించి బీఎల్‌ఓ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. మృతి చెందిన ఓటర్లను గుర్తించి ఫారం –7 ద్వారా మరణ ధృవీకరణ పత్రం అప్లోడ్ చేసి వారి పేర్లను తొలగించాలని అన్నారు. శిక్షణ అధికారి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఇమామ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, సూపర్‌వైజర్లు శరత్‌కుమార్, అచ్చారావు, రమేశ్, శైలజ పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : ఓటర్ జాబితాలో పేర్ల నమోదు, సవరణ చేసేందుకు ఇంటింటికెళ్లి సర్వే చేపట్టాలని తహసీల్దార్ గుండాల నాగరాజు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని సూపర్‌వైజర్లకు, బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులను గుర్తించి బీఎల్‌ఓ యాప్‌లో ఓటరుగా నమోదు చేయాలని అన్నారు. ఓటర్ జాబితాలో తప్పులను గుర్తించి ఫామ్–8 ద్వారా సవరణ చేయాలన్నారు. మరణించినవారు ఉంటే ఫామ్–7 ద్వారా మరణ ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేసి తొలగించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హేమనాయక్, ఏఎస్ఓ సునీత, సూపర్ వైజర్లు మహేశ్, ప్రభాకర్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి పిడుగులాంటి మనిషి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పరకాల : వాడుకభాషా కోసం యుద్ధం చేసిన గిడుగు రామ్మూర్తి పిడుగులాంటి మనిషి అని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్ అన్నారు. పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రాంథిక భాషను వదిలి వ్యవహారిక భాషలోకి అనువాదించి సామాన్యులకు తెలుగును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రతిఒక్కరూ రామ్మూర్తి జీవిత చరిత్రను తెలుసుకోవాలని అన్నారు. అధ్యాపకులు మోరె అశోక్‌కుమార్, సమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కల్పన, భీమరావు, శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్, రాజశ్రీ, అశోక్ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : తెలుగుభాషా గొప్పదనం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని ముప్పారం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో గురువారం గిడుగు రామ్మూర్తి గొప్పదనాన్ని తెలిపారు. పాఠశాల ఎస్ఓ మాధవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న లక్కాకులమ్మ బ్రహ్మోత్సవాలు



హోమం చేస్తున్న అర్చకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లోని లక్కాకులమ్మ జాతర బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సంతాన, సౌభాగ్యానికి ప్రతీకైన లక్కాకులమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు.. సంతానం కలుగాలని అమ్మవారికి ముడుపులు కట్టారు. సౌభాగ్యంతో నిండు నూరేళ్ల జీవించేలా సల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. కాగా ఆలయ అర్చకులు మొదటి రోజైన బుధవారం గణపతిపూజ, అమ్మవారికి పంచామతాభిషేకాలు, అలంకరణ, స్వస్తిపుణ్యాహావచనం, త్రయాహ్నిక దీక్ష, శక్తి హోమం, అఖండ దీపారాధన, నవగ్రహ అష్టదిక్పాలక, ఆవరణ దేవత పూజలు, బోనం సమర్పణ చేపట్టారు. అలాగే రెండోరోజైన గురువారం అమ్మవారికి అష్టోత్తర సహస్ర నామార్చన, అభిషేకాలు, కుంకుమ పూజలు, ముడుపులు సమర్పించుట, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పిచ్చిమొక్కలతో వైకుంఠధామం



మండలంలోని తిరుమలగిరిలో గత ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకుని శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. - ఆత్మకూరు

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : అనూష, పంచాయతీకార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9398678002

పట్టరపట్టు హైలెస్సా..!



మండలంలోని ల్యాదెళ్ల గ్రామపంచాయితీ ట్రాక్టర్ మొరాయిస్తుంది. సెల్ఫ్ పనిచేయకపోవడంతో సిబ్బంది గ్రామస్తులతో సహకారంతో తలోచేయ్యి వేసి పట్టరాపట్టు హైలెస్సా అంటూ ముందుకు నెడుతూ ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసేందుకు నానా తిప్పల పడుతున్నారు. అయితే వీధుల్లో పేరుకుపోయిన చెత్త సేకరణ, ట్యాంకర్‌తో నీటిసరఫరా తదితర పనులకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. కానీ స్టార్టింగ్ ట్రబుల్ ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

- దామెర